క్లుప్తంగా

ఈనెల 16న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సలిపెల రమేష్ రెడ్డి, నిరంజన్‌రెడ్డిలు తెలిపారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో సుందరయ్య విజ్ఞన కేంద్రంలో ఈ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. సుందరయ్య పార్కులో ముందుగానే తమ పేర్లను మహిళలు నమోదు చేసుకోవాలని సూచించారు.

లక్ష్మీగణపతి దేవాలయంలో ఘనంగా శత కలశాభిషేకం



శతకలశాభిషేకంలో పాల్గొన్న భక్తులు

చిక్కడపల్లి : ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ప్రముఖ లక్ష్మీ గణపతి దేవాలయంలో సంకట చతుర్ధి సందర్భంగా స్వామి వారికి శతకలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చుకుర్తి ప్రభాకర్, ఈఓ లక్ష్మారెడ్డి, సభ్యులు వెంకట గోవిందరావు, రమణ మూర్తి, డాక్టర్ వెంకటరమణ, రాజా శ్రీనివాస్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గంగులకు జన్మదిన శుభాకాంక్షలు



మంత్రికి శుభాకాంక్షలు చెబుతున్న మున్నూరుకాపు మహాసభ ప్రతినిధులు

కాచిగూడ: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ జన్మదినం సందర్భంగా సోమవారం తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం కేసీఆర్ మంత్రి వర్గంలో ఉన్న ఏకైక మంత్రి అని ఆయన నాయకత్వంలో మున్నూరుకాపుల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా మహాసభ నేతలు కోరారు. అయిలి శ్రీనివాస్, మణికొండ రమేష్, సురేష్ బాబు, హనుమంతరావు, బీఆర్ జితేందర్ తదితరులున్నారు.

సంగీత నాటక పరిరక్షణకు స్థలం కేటాయించాలని వినతి



కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న ఎల్.వీ.చెన్నారావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సంగీత నాటక పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి జాతీయ వాయిద్య కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షులు చెన్నారావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంగీత, నాటక కళలను భావితరాలకు అందించాలని సోమవారం మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం త్యాగరాజస్వామి జ్ఞాపికను కేంద్రమంత్రికి అందజేసి సత్కరించారు. సంఘం నగర అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు సురేందర్, నగేష్, రమణ తదితరులున్నారు.

బీఆర్ఎస్ పథకాలపై ఇంటింట ప్రచారం

చిలకలగూడ: బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ సీతాఫల్‌మండి ఉప్పరి బస్తీలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ సీనియర్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 50 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను ఏడేళ్లలో పూర్తిచేసిన ఘనత పద్మారావుకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మీ, రేవతి, గగనకుమారి, సంగీత, సరోజని, మణిమంజరి, శ్వేత, ప్రవల్లిక, పద్మ, అర్చన, నవీన్, రాజేష్, జయశ్రీ, మారేపల్లి రవి పాల్గొన్నారు.

ముగిసిన నాయిని మెమోరియల్ షటిల్ టోర్నమెంట్- 2 పోటీలు



విజేతలకు మెమోంటోలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: డివిజన్ జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ షటిల్ క్రీడాకారుడు బొల్లం శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరయ్యారు. గౌరవ అతిథిగా ఏషియా ఇంటర్నేషనల్ హ్యాండ్లూమ్ అంబాసిడర్ రష్మీఠాకూర్, బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, నాయిని నర్సింహ్మారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ట్రస్ట్ ఉపాధ్యక్షులు నాయిని దేవేందర్‌రెడ్డి, నేషనల్ వాలీబాల్ ప్లేయర్ శ్రీలతలు పాల్గొన్నారు.

- ఈ పోటీల్లో 50 ఏళ్లు దాటిన విజేతలు సోమేశ్వర్, ఎస్.శ్రీనివాస్, రన్నర్స్ సీ.హెచ్.వీరారెడ్డి, బొల్లం శ్రీనివాస్, జనరల్ కేటగిరిలో విజేతలుగా రాహుల్‌రాజ్‌కుమార్, రన్నర్స్ చిరంజీవి, షహన్‌షా, బాలికల పోటీల్లో విజేతలుగా హరుద్యరాగిణి, మేరి పద్మశ్రీ, రన్నర్స్‌గా దేదీప్య, ప్రదీప్యలకు మెమోంటోలు, సర్టిఫికెట్స్, నగదు బహుమతులను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు నేత శ్రీనివాస్, బుజ్జి వెంకటేశ్వరరావు, పున్న ప్రవీణ్, పూస గోరఖ్‌నాథ్, బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, అనిల్, అమరం వినోద్, ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్‌ముదిరాజ్, సిద్ధిఖ్, క్రీడాకారులు, స్థానిక కాలనీల వాసులు పాల్గొన్నారు.

‘లిక్కర్ స్కామ్‌పై కేంద్ర ప్రభుత్వం కుట్ర’

కవాడిగూడ: ‘లిక్కర్ స్కామ్‌పై కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని దీనిపై ఈనెల 6న రాజేష్‌జోషి, గౌతమ్‌మల్హోత్రాలకు కోర్టు బెయిల్ మంజూరు’ చేస్తూ.. చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వం, సీబీఐకి చెంపపెట్టులాంటిదని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం దోమలగూడలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాముగౌడ్, శోభన్‌నాయక్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. పార్టీని బదనాం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనేక కుట్రలు చేస్తోందని దీనిలో భాగంగానే లిక్కర్ స్కామ్ అని ఆరోపించారు.

- వచ్చే ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ కేంద్రంలో అధికారంలోకి రాబోతుందని దీనిని అడ్డుకోవడానికే మోదీ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని విమర్శించారు.
- కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి పద్ధతులు మానుకోకపోతే ప్రజలు తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు దేశ వ్యాప్తంగా మంచి ఆదరణ ఉందని అదే ఊపుతో వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు, ఆమ్‌ఆద్మీ పార్టీని బయపెట్టాలని కేంద్రం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న ఎస్‌బీ కాబ్రా. డాక్టర్ డీవీజీ కృష్ణ

కాచిగూడ: మార్వాడీ శిక్షా సమితి, కేడియా కామర్స్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కాలేజీలో చదువుకుని ఉన్నత స్థాయిలో ఉన్నవారు, విదేశాల్లో మంచి స్థాయిలో ఉన్నవారు తమ కాలేజీ రోజులను నెమరు వేసుకున్నారు. దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ స్మృతులను పంచుకున్నారు. ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుకుంటున్న వారికి దిశా నిర్దేశం చేయాలని ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ మాజీ డీన్ ఆర్.నాగేశ్వర్‌రావు అన్నారు. ఎంఎస్‌ఎస్ కార్యదర్శి సురేంద్ర లూనియా, సంయుక్త కార్యదర్శి సీఏ ఎస్‌బీ కాబ్రా, డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ డీవీజీ కృష్ణ, రామచంద్ర మూర్తి, వందన, డాక్టర్ కె.శ్రీహరి, డాక్టర్ శ్రీనివాస్‌కుమార్, డాక్టర్ కేవీఎస్ సుధాకర్, డాక్టర్ టీవీ రావు, డాక్టర్ నాగప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర చెట్ల కొమ్మల తొలగింపు



చెట్ల కొమ్మలను తొలగింపజేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: మౌలానా ఆజాద్‌నగర్ బస్తీలో భారీగా పెరిగిన చెట్ల కొమ్మలు తరచుగా విరిగి పడుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానిక ప్రజలు కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం జీహెచ్‌ఎంసీ, విద్యుత్ అధికారులు, సిబ్బందిని పిలిపించి చెట్ల కొమ్మలను కార్పొరేటర్ తొలగింపజేశారు. ఎలాంటి సమస్యలున్నా ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్ సూచించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి బస్తీలో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, భీమ్‌రాజ్, ఎస్. రవి యాదవ్, సుభాష్ పటేల్, ముఖేష్, కృష్ణ, కలమ్మ, బాలమణి, ఓంప్రకాష్, రామకృష్ణ, దినేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా!



శాంతినగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బాగ్ అంబర్‌పేట డివిజన్, శాంతినగర్‌లో రూ. 15 లక్షలతో నూతనంగా చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్, డ్రైనేజీ పైపులైన్, వరదనీటి పైప్‌లైన్, నాలాల అభివృద్ధి, విద్యుత్ లైన్లు, పార్కుల అభివృద్ధి, సుందరీకరణ వంటి పనులను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘అన్ని వర్గాలకు ప్రభుత్వం ఫంక్షన్ హాళ్లు నిర్మించడం హర్షణీయం’



గోనె సాల్మన్‌రాజ్

చిక్కడపల్లి: అన్ని మతాలు, కులాల సౌకర్యం కోసం సీఎం ప్రతి గ్రామపంచాయితీ పరిధిలో ఫంక్షన్ హాళ్లను నిర్మించాలనే ప్రతిపాదనపై తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్, పాస్టర్స్ అసోసియేషన్ (టీయూసీపీఏ) ప్రధానకార్యదర్శి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ క్రిస్టియన్ లీడర్ గోనె సాల్మన్‌రాజ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన చిక్కడపల్లిలో మాట్లాడుతూ.. ఉచితంగా ఆయా ఫంక్షన్‌హాళ్లలో అన్ని మతాలు, కులాలవారు శుభకార్యాలు చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. రూ.3 నుంచి రూ.5 కోట్ల రూపాయలు వెచ్చించి ఫంక్షన్‌హాళ్లు నిర్మించి ఉచితంగా శుభకార్యాలు నిర్వహించుకునేందుకు పేదలకు వీలు కల్పించడం ద్వారా వారికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలందరూ.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘కౌన్సిల్’ సమావేశాన్ని ఏర్పాటు చేయాలి

మలక్‌పేట: జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చ లేకుండానే ప్రతిపక్ష బీజేపీ కార్పొరేటర్లపై నిందమోపడం శోచనీయమని ఆపార్టీ మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని కృష్ణతులసినగర్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తూ మేయర్‌ను, కౌన్సిల్ సభ్యులను అవమాన పరుస్తూ చట్ట వ్యతిరేక నిర్ణయం తీసుకున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని, కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చందు, గణేష్, సంతోష్, మల్లేష్, పరశురామ్, దినేష్ తదితరులు ఉన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీకి ఈనెల 31 లోపు ఎంట్రీ చేసుకోవాలి

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ సహకారంతో జూన్ 2 నుంచి 4 తేదీ వరకు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్-2023 నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొరెడ్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎంపిక కోసం టోర్నీ నిర్వహిస్తున్నామని, సబ్‌జూనియర్, జూనియర్, పురుషులు, మహిళలు, వెటరన్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌ల్లో పాల్గొనేందుకు ఈనెల 31 తేదీ లోపు ఎంట్రీ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 77889 93006, 98480 15443 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

ముగిసిన నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాలు

సుల్తాన్‌బజార్: నవ్యనాటక సమితి 65వ వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలు సోమవారం సుల్తాన్ బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో ముగిశాయి. ఈ ఉత్సవాలకు ప్రముఖ నర్తకి పద్మశ్రీ డాక్టర్ పద్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణా శిబిరంలో పాల్గొన్న నృత్య గురువులకు, యువ కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేసి వారిని అభినందించారు. ఈ శిక్షణా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన నృత్య గురువు బాగవతుల సేతూరామ్‌ను సైతం సంస్థ పక్షాన సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజా రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ సంగీత శాస్త్రీయ నృత్యాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వసుంధర, విజయ్‌కుమార్‌తో పాటు పెద్ద ఎత్తున కళాకారులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలోని ఏడు విభాగాల్లో 1331 మందిని క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని తెలంగాణ పబ్లిక్ అండ్ మెడికల్ హెచ్-1 యూనియన్ అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ముందు సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ శ్రీనివాసరావు, ఆర్‌వీ మహేందర్, సంఘం సెక్రెటరి సుదర్శన్, జాయింట్ జనరల్ సెక్రెటరి అత్తాబ్, మహ్మద్‌ఖాన్, అజీజ్, రవీందర్, జనార్ధన్, విజయ్‌పాల్‌రెడ్డి, ధినేష్కర్‌బాబు, మాధవి, సతీష్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి గజవాహన సేవ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రసిద్ధి గాంచిన చిక్కడపల్లిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గజ వాహన సేవ ఆకట్టుకుంది. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ పుణ్యాహవచనం, బిందె తీర్థం, బాలబోగం, మంత్ర పుష్పం, వేదపారాయణం, ఉదయం 10.30 గంటలకు పల్లకి సేవ, 11.30 గంటలకు మహానివేదన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు వేదపారాయణం, ద్రవిడ ప్రభందనం, హోవనం, సాయంత్రం 7 గంటలకు బలిహరణ, మహానివేదన కార్యక్రమాలు జరిగాయి. కార్యనిర్వహణ అధికారి కె.రామాంజనేయులు, ఆలయ వంశీయులు శ్రీనాథ్‌గౌడ్, కీర్తనదంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు గజ వాహన సేవలో భాగంగా చిక్కడపల్లిలోని శ్రీనివాసపురం పురవీధుల మీదుగా వేదమంత్రోచ్ఛరణలతో మంగళ వాయిద్యాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఆస్పత్రి ఏర్పాటుపై సీఎంతో మాట్లాడుతా

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



అఖిలపక్ష నేతలతో మాట్లాడుతున్న పద్మారావు గౌడ్

లాలాపేట: చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో వడ్డెర బస్తీ కమాన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 34వ రోజుకు చేరుకుంది. అయితే.. ఓయూలో ఈద్-మిలాప్ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌ను మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం నాయకులు కలిశారు. హాస్పిటల్ కోసం గత 34 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నామని బస్తీ వాసుల కోసం హాస్పిటల్ ఏర్పాటు చేయాలని కోరగా త్వరలో సీఎం కేసీఆర్‌ను కలిసి హాస్పిటల్ ఏర్పాటుపై మాట్లాడి మీకు శుభవార్త చెప్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలకుంట హరి, గండికోట విజయ్‌కుమార్, శ్రీనివాస్, కుమార్, నర్సింహ, ఆలకుంట లింగయ్య, ప్రశాంత్, బబ్లూ, శ్రీను, ఓర్సు శేఖర్, జగన్, కృష్ణ పాల్గొన్నారు.

తలసీమియాపై అవగాహన అవసరం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

గాంధీఆస్పత్రి: తలసీమియా వ్యాధిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్య నిపుణులు సూచించారు. తలసీమియా సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి పిడియాట్రిక్ సర్జరీ విభాగంలో సోమవారం ప్రపంచ తలసీమియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ పిడియాట్రిక్ సర్జరీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ నాగార్జున, సికిల్‌సెల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రకాంత్ అగర్వాల్, సుమన్ జైన్ మాట్లాడారు. తలసీమియా వ్యాధి వంశపారంపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తోందని, గాంధీ పిడియాట్రిక్ సర్జరీ విభాగంలో గత మూడేళ్లలో 40 మందికి స్ప్లెనెక్టమీ సర్జరీలు విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు. గాంధీ పిడియాట్రిక్ సర్జరీ విభాగంలో ఏర్పాటు చేసిన ‘చిల్డ్రన్స్ ప్లే డెన్’ చిన్నారులకు త్వరితగతిన స్వస్థత చేకూర్చేందుకు దోహదపడుతుందన్నారు. ‘బీ అవేర్ షేర్ కేర్’ నినాదంలో ఈ ఏడాది అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తలసీమియా వ్యాధిగ్రస్తులకు గాంధీఆస్పత్రి అందిస్తున్న వైద్యసేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, కవిమోజీ ఇలక్కియా, రాజ్‌కిరణ్, ఫణీంద్ర, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అమోఘం



సిబ్బందిని సన్మానిస్తున్న ఏసీపీ యాదగిరి, ఇన్‌స్పెక్టర్ సంజయ్‌కుమార్

చిక్కడపల్లి: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది పాత్ర అమోఘమని చిక్కడపల్లి ఏసీపీ ఎ.యాదగిరి అన్నారు. చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న 18 మంది సిబ్బందిని చిక్కడపల్లి ఏసీపీ యాదరిగి, స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్ సోమవారం సాయంత్రం సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకటరమణ, సందీప్‌రెడ్డి, నాగరాజు, కిరణ్‌కుమార్, అభిలాష్, శిశుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేయడం దారుణం’



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ కార్పొరేటర్లు

కవాడిగూడ: ఇటీవల జరిగిన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని అధికారులు బాయ్‌కాట్ చేయడం అత్యంత దారుణమని ఈ సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిల్ సమావేశం నిర్వహించేంత వరకు బీజేపీ కార్పొరేటర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బైకాట్ చేసిన అధికారులను సస్పెండ్ చేసి మరోసారి జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని అధికారులు బాయ్‌కాట్ చేయడాన్ని నిరసిస్తూ.. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నగరానికి చెందిన పలువురు బీజేపీ కార్పొరేటర్లు హాజరై అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేటర్లు కె.రవిచారి, మధుసూదన్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, అరుణ, సురేఖ, సుచిత, సుప్రియానవీన్‌గౌడ్, శ్రావణ్, మహేందర్, దీపిక, ఆలే భాగ్య, మహాలక్ష్మి, పద్మావెంకట్‌రెడ్డిలు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలేక ప్రభుత్వమే అధికారుల చేత సమావేశాన్ని బాయ్‌కాట్ చేయించిందని వారు ఆరోపిచారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్

కాచిగూడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలో సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సోమవారం డివిజన్‌లోని నింబోలిఅడ్డలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో కలిసి కార్పొరేటర్‌పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్లీన్ అండ్ గ్రీన్, స్ట్రీట్ లైట్లు, కలుషిత నీరు, డ్రైనేజీ, పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు తదితర సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృషికి తీసుకొచ్చారు. జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్ కుమార్, జలమండలి అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ వెంకటేష్, విద్యుత్ ఏఈ అంబికా, జవాన్ వెంకటయ్య, విద్యుత్ లైన్‌మెన్ విజ య్, బస్తీనేతలు ప్రణవ్ సింగ్, అ. ద్యక్షుడు దూలత్ సింగ్, హేమంత్ సింగ్, రవి శంకర్ సింగ్, మో తిలాల్ సింగ్, హరితిలక్ సింగ్, రాజేందర్ సింగ్, జీవన్‌రావు, కిషన్‌సింగ్, రాజు, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, అరవింద్, మహేష్ పాల్గొన్నారు.

జేపీఎస్‌లతో చర్చలు జరపాలి



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: గత 11 రోజులుగా సమ్మె చేస్తున్న 9,355 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను చర్చలకు పిలిపించి సమస్యలు పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన సోమవారం కాచిగూడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు న్యాయమైనవేనని వీరిని ఉద్యోగంలోకి తీసుకున్నప్పుడే మూడేళ్లలో రెగ్యులరైజ్ చేస్తామని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారని కృష్ణయ్య వివరించారు. నాలుగేళ్లు గడిచినా కూడా రెగ్యులర్ చేయకపోవడంతోనే వారు సమ్మెలకు వెళ్లారన్నారు. సీఎం కేసీఆర్ ప్రతిష్ఠకు పోకుండా వెంటనే వారిని రెగ్యులర్ చేస్తూ.. గ్రేడ్ -4 ఉద్యోగులుగా గుర్తించి నాలుగేళ్ల సర్వీస్‌ను కలిపి ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. నీల వెంకటేష్, రాఘవ జోషి, వేముల రామకృష్ణ, సుధాకర్, అనంతయ్య, హరీష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.